సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం, 16, అక్టోబర్, 2025



కుంగుబాటు..లొంగుబాటు !

సిరిసిల్ల: ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు మావోయిస్టు, జనశక్తి ఉద్యమాలు బలంగా ఉండేవి. లొంగుబాట్లతో నక్సలైట్ ఉద్యమం కనుమరుగైంది.

- 10లో▸



కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముస్తాబాద్: పోతుగల్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో బందనకల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు బుధవారం ప్రారంభించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/23.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ ఉంటుంది. రాత్రి వేళ గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అనంతపల్లికి ఆర్టీసీ సేవలు ప్రారంభం



ఆర్టీసీ పీఆర్వో, డ్రైవర్, కండక్టర్‌లను సన్మానించిన గ్రామస్తులు

చందుర్తి(వేములవాడ): మండలంలోని అనంతపల్లికి ఆర్టీసీ సేవలు బుధవారం ప్రారంభమయ్యాయి. గత పన్నెండేళ్ల క్రితం ఆ గ్రామస్తులు ఆర్టీసీ సేవలకు దూరమయ్యారు. గ్రామస్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే కాలినడకనే మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి. పన్నెండేళ్లుగా పలుమార్లు గ్రామానికి బస్సు సర్వీసు వేయాలని పాలకులు, అధికారులకు మొరపెట్టుకున్నారు. వారం క్రితం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గ్రామస్తులు విన్నవించగా.. విప్ ఆదేశాలతో బస్సు సర్వీసు బుధవారం ప్రారంభమైంది. వేములవాడ నుంచి అనంతపల్లి మీదగా తిమ్మాపూర్ వరకు బస్సు నడిపిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, రుద్రంగి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బొజ్జ మల్లేశం, వేములవాడ ఆర్టీసీ డిపో పీఆర్వో శ్రీనివాస్, గ్రామస్తులు తొట్ల మల్లేశం, చిన్న వెంకటేశం, కనకరాజు, రాజయ్య, మహేశ్, అనిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికలు



ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న టౌన్ సీఐ కృష్ణ

సిరిసిల్లకల్చరల్: ఓటు విలువ, ఎన్నికల నిర్వహణపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు కాలేజీల్లో నిర్వహిస్తున్న ఎన్నికలు దోహదపడతాయని సిరిసిల్ల టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం పోలింగ్ నిర్వహించారు. లెక్చరర్ చంద్రమౌళి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తూ హెడ్‌బాయ్స్, హెడ్‌గర్ల్స్ పదవుల కోసం ఎన్నికలు జరిపించారు. కాలేజీ ప్రెసిడెంట్‌గా జి.భావన, హెడ్‌గర్ల్‌గా ఎస్.అక్షయ, హెడ్ బాయ్‌గా ఎ.సిద్ధార్థ ఎన్నికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయరఘునందన్ పర్యవేక్షణలో లెక్చరర్లు కేదారేశ్వర్, వెంకటేశం, వివేకానంద, ఆంజనేయులు, చంద్రశేఖర్, కనకయ్య, రాజయ్య, సరోజన, శ్రీనివాస్, శ్రీధర్, రాజశేఖర్, శ్రీనివాస్, సుజిత, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలి


- జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం



సుభాష్‌నగర్‌లో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, డీసీపీవో కవిత

సిరిసిల్ల: గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు విధిగా ఆకుకూరలు, పండ్లు అందించాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం సూచించారు. పోషణ మాసంలో భాగంగా జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన కల్పించారు. లక్ష్మీరాజం మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోషణ మాసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆహారంలో ఆయిల్, షుగర్ వాడకాన్ని తగ్గించాలని, పాలు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. డీసీపీవో కవిత, సూపర్‌వైజర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



కబడ్డీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14 విభాగంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎల్లారెడ్డిపేట కేజీబీవీ విద్యార్థిని వి.భార్గవి ఎంపికైంది. ఉమ్మడి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తుందని కేజీబీవీ స్పెషలాఫీసర్ అనిత, పీఈటీ శ్రీలత తెలిపారు.



మంచుకురిసే వేళలో..

ముస్తాబాద్‌ను మంచుతెరలు కమ్మేశాయి. బుధవారం ఉదయం మంచుపొగ పరుచుకోగా.. వాహనాలు లైట్లు వేసుకోవాల్సి వచ్చింది. ఉదయం ఏడు గంటలు దాటినా మంచుతెరలు తొలగిపోలేదు. మంచుతెరలను చీల్చుకుంటూ సూర్యోదయం వాకర్స్‌ను అబ్బురపరిచింది.

– ముస్తాబాద్(సిరిసిల్ల)

రోడ్డుపై గుంతలు ఇలా.. వెళ్లేదెలా?



జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్ డిపోకు వెళ్లే దారిలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతలు పడ్డాయి. అడుగుకో గుంత పడి ప్రమాదకరంగా మారాయి. రోడ్డు ఇలా ఉంటే ఎలా వెళ్లేదంటూ పలువురు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అంతర్గత రోడ్లను బాగు చేయాలని వారు కోరుతున్నారు.

– సిరిసిల్లఅర్బన్

ఎగువ మానేరుపై నిర్లక్ష్యం

- మధ్య, దిగువమానేరు ప్రాజెక్టుల్లో పూడికతీత
- ఎగువమానేరులో ప్రతిపాదనలకు నో
- 75 ఏళ్లుగా తట్టెడు మట్టి తీయని పాలకులు
- పూడికతో తగ్గిన ఒక టీఎంసీ నీటి సామర్థ్యం
- చివరి ఆయకట్టుకు అందని నీరు



ముస్తాబాద్(సిరిసిల్ల): ఎగువమానేరు ప్రాజెక్టు పాలకుల నిర్లక్ష్యానికి గురువుతోంది. 75 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టులో పూడికతీయకపోవడంతో నీటి సామర్థ్యం సగానికి పైగా పడిపోయింది. ఎగువమానేరు ప్రాజెక్టు ఆధారంగా పారే మానేరువాగుపైనే మధ్య, దిగువమానేరు ప్రాజెక్టులను నిర్మించారు. సముద్ర మట్టాలనికి అత్యంత ఎత్తులో ఉండే సిరిసిల్ల మెట్టప్రాంతానికి జీవనాధారమైన ఎగువమానేరు ప్రాజెక్టుపై అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోందనే విమర్శలు ఉన్నాయి. మధ్యమానేరు ప్రాజెక్టుతోపాటు దిగువ మానేరు ప్రాజెక్టులో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. కానీ ఈ రెండు ప్రాజెక్టులకు ఎగువనే ఉన్న నర్మాల ప్రాజెక్టుపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు తట్టెడు మట్టిని కూడా తీయలేదనే అపవాదు ఉంది. తాజాగా మధ్యమానేరు, లోయర్‌మానేరు(ఎల్‌ఎండీ)లలో పూడికతీత పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడం ఈ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తోంది.

నిజాం కాలం నాటి నర్మాల ప్రాజెక్టు

1945లో ఆఖరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నర్మాల వద్ద కూడవెల్లి, పాల్వంచవాగులు కలిసే చోట ప్రాజెక్టును నిర్మించారు. రూ.1,29,288లతో 17,680 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో ప్రాజెక్టును నిర్మించారు. 1945లో మొదలైన పనులు 1950లో పూర్తయ్యాయి. ఆరుగురు చీఫ్ ఇంజినీర్ల పర్యవేక్షణలో ఐదేళ్లలో నిర్మించిన ప్రాజెక్టు 75 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఇన్నాళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న ప్రాజెక్టు ఆనాటి చక్కటి ఇంజినీరింగ్ పనితనానికి సాక్ష్యంగా నిలుస్తోంది. ఇప్పటి వరకు ప్రాజెక్టులో పేరుకుపోయిన సిల్ట్‌ను ఏనాడు తీయలేదు. 2002లో అప్పటి మంత్రి, నేరెళ్ల ఎమ్మెల్యే కుడి కాలువను సీసీ చేయించారు. అది మినహా ఏ ప్రభుత్వం ప్రాజెక్టు కోసం నిధులను కేటాయించలేదు.

రెండు ప్రాజెక్టులకు నిధులు

ఎగువ మానేరు ప్రాజెక్టు కింద ఉన్న మధ్యమానేరు, దిగువ మానేరు ప్రాజెక్టుల్లో డీసిల్టింగ్, డ్రెజింగ్ విధానంతో పూడికతీత పనులు చేపడుతున్నారు. ఇప్పటికే ఎల్‌ఎండీలో పనులు కొనసాగుతున్నాయి. మధ్యమానేరులో నీటిమట్టం తగ్గగానే పూడికతీత పనులు చేపట్టనున్నారు. వీటితోపాటు నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులో పూడికతీతకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఎల్‌ఎండీలో ట్రయల్‌రన్ పూర్తి చేశారు. డీసిల్టింగ్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తోంది. పూడికమట్టిని రైతులకు అందించడం ద్వారా, అక్కడే లభించే ఇసుకను విక్రయించడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం చేరనుంది. ప్రాజెక్టుల్లో డీసిల్టింగ్ ద్వారా నీటి సామర్థ్యం పెరగనుంది.

తగ్గిన ఒక టీఎంసీ సామర్థ్యం

ఎగువమానేరు ప్రాజెక్టును 75 ఏళ్లుగా డీసిల్టింగ్ చేయకపోవడంతో దాని సామర్థ్యం తగ్గిందని ఇంజినీర్లు చెబుతున్నారు. మూడు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ప్రాజెక్టులో సిల్ట్ పేరుకుపోవడంతో ఒక టీఎంసీ సామర్థ్యం తగ్గిందని పేర్కొంటున్నారు. దీంతో 18వేల ఎకరాలకు అందించాల్సిన నీరు ప్రస్తుతం 12వేల ఎకరాలకు మాత్రమే పరిమితం చేయాల్సి వచ్చింది. ఎగువమానేరు ప్రాజెక్టు సిల్ట్ తొలగిస్తే ఒక టీఎంసీ పెరిగి జిల్లెల్ల, దేశాయిపల్లి, బద్దెనపల్లి, తాడూరు వరకు సాగునీటిని అందించవచ్చు. అయితే ఈ ప్రాజెక్టులో డీసిల్టింగ్‌కు అధికారులు చేసిన ప్రతిపాదనలకు మంజూరు రాలేదు. వచ్చే ఏడాదైనా నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రాజెక్టుతోనే బతుకు



మానేరు ప్రాజెక్టుతో మా తాతలు.. తండ్రులు బతికిండ్రు. దానిని బతికించుకోవాలే. అందులో పూడికతీస్తే నీళ్లు ఎక్కువ వస్తయి. ఇప్పుడు తెర్లుమద్ది దాకా కూడా వస్తలేవు. ప్రాజెక్టును బాగుచేస్తే వేల కుటుంబాలు బతుకుతాయి.

– పుట్ట చంద్రయ్య, రైతు, తెర్లుమద్ది

ప్రాజెక్టు పరిరక్షణకు ఉద్యమాలు



ఎగువ మానేరు ప్రాజెక్టుతో సిరిసిల్ల ప్రాంతానికి విడదీయరాని సంబంధం ఉంది. ప్రాజెక్టుతోనే పంటలు పండాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. తట్టెడు మట్టిని కూడా పూడిక తీయలేదు. పదిహేనేళ్ల క్రితం ప్రాజెక్టు ఆయకట్టు కోసం ఉద్యమాలు చేశాం. ప్రాజెక్టుతోనే ఈ ప్రాంతం మనుగడ సాధ్యమవుతుంది.

– వొరగంటి తిరుపతి, ముస్తాబాద్

డీసిల్టింగ్‌కు ప్రతిపాదనలు



ప్రాజెక్టులో డీసిల్టింగ్‌కు మార్చి నెలలోనే ప్రతిపాదనలు చేశాం. ప్రస్తుతానికి మధ్య, దిగువ మానేరు ప్రాజెక్టులకు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే ఎగువమానేరు ప్రాజెక్టుకు నిధులు వస్తాయి. అప్పుడు డీసిల్టింగ్ పనులు చేపట్టడం జరుగుతుంది. ఆధునీకరణ పనులు చేస్తాం.

– రవికుమార్, డీఈఈ

ఎల్‌ఈడీ స్క్రీన్‌లో దర్శనం



రాజన్న ఆలయ ఆవరణలో కూల్చివేతలు, విస్తరణ పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కలెక్టర్ హరిత, ఎస్పీ మహేశ్ బీ గీతే

- అందరి సలహాలు, సూచనల మేరకు పనులు
- 19న వేములవాడకు శృంగేరి పీఠాధిపతి రాక
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులపై సమీక్ష
- హాజరైన దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కలెక్టర్ ఎం. హరిత, ఎస్పీ మహేశ్ బీ గీతే

వేములవాడ: రాజన్న ఆలయంలోని రావిచెట్టు వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌లో దర్శనం కల్పించనున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధే ప్రధాన ఎజెండా అని పేర్కొన్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి, ఈనెల 19న శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతిస్వామి రాక సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్, వీటీడీఏ వైస్‌చైర్మన్, కలెక్టర్ హరిత, ఎస్పీ మహేశ్ బీ గీతే తదితరులతో కలిసి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి పనులను అందరి సలహాలు, సూచనల మేరకు చేపడుతున్నట్లు వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రుల సహకారంతో పనులు ముందుకుసాగుతున్నాయని తెలిపారు. మొదటిదశలో రూ.76కోట్లతో ప్రధాన ఆలయ విస్తరణ, అభివృద్ధి, రూ.35 కోట్లతో నిత్యాన్నదానం, రూ.47కోట్లతో ప్రధాన రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఆలయ పనులపై ప్రతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీకిస్తున్నామని తెలిపారు.

19న శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీస్వామి రాక

ఈనెల 19న శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతిస్వామి రానున్నారని వెల్లడించారు. ఆమేరకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించామని పేర్కొన్నారు. భక్తులకు రాజన్న ఆలయ ఆవరణలోని రావిచెట్టి వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్, ప్రచారరథంలో శ్రీస్వామి వారి దర్శనం కల్పిస్తామని చెప్పారు.

రాజన్న సేవలో రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

రాజన్నను రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ హరిత, ఎస్పీ మహేశ్ బీ గీతే, ఆర్డీవో రాధాభాయి, వీటీడీఏ అధికారులు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో రమాదేవి, అర్చకుల బృందం స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనానంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుల నియామకం

- కొత్తగా పొలిటికల్ అఫైర్ కమిటీ
- జిల్లాలో పార్టీని పునర్‌నిర్మిస్తాం
- ఏఐసీసీ అబ్జర్వర్ మన్నె శ్రీనివాస్
- సిరిసిల్ల, వేములవాడలో కార్యకర్తలతో సమావేశాలు



మాట్లాడుతున్న మన్నె శ్రీనివాస్, విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్/వేములవాడ: పార్టీ జిల్లా అధ్యక్షుడు నుంచి మండల అధ్యక్షుల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తామని ఏఐసీసీ అబ్జర్వర్ మన్నె శ్రీనివాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా రాజన్నసిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియపై బుధవారం కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సిరిసిల్లలోని మల్లికార్జున ఫంక్షన్‌హాల్, వేములవాడలోని మహాలింగేశ్వర గార్డెన్స్‌లలో నిర్వహించిన సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సంఘటన్ అభియాన్‌లో భాగంగా జిల్లా అధ్యక్షుల ఎన్నికల ప్రక్రియపై కార్యకర్తల అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ముందస్తుగా కార్యకర్తల సలహాలు, సూచనలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నెల రోజుల్లోగా జిల్లా అధ్యక్షుడి ఎన్నిక పూర్తయ్యేలా చూస్తామన్నారు. జిల్లా స్థాయిలో కొత్తగా పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అధిష్టానం ఆదేశాలు ఆచరిస్తాం

– ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు పదవుల ఎన్నిక చేపడతామని ప్రభుత్వ విప్, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాలతో మమేకమై రాబోయే రోజుల్లో పటిష్ట నాయకత్వం పదవులు అధిష్టించేలా చూస్తామన్నారు. ఎన్నికల అబ్జర్వర్ల నివేదికను ఏఐసీసీకి పంపిస్తారని పేర్కొన్నారు. పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, వెల్మల స్వరూప, సంగీతం శ్రీనివాస్, చిట్ల సత్యనారాయణ, కనిమేని చక్రధర్‌రెడ్డి, వైద్య శివప్రసాద్, కాముని వనిత, సూర దేవరాజు, కూస సత్యనారాయణ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

- అదనపు కలెక్టర్ నగేశ్
- కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన



సీపీఆర్ చేస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

సిరిసిల్ల: సీపీఆర్(కార్డియో పల్మనరీ రిసోసియేషన్)పై అందరికీ అవగాహన ఉండాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్ పేర్కొన్నారు. సీపీఆర్ అవగాహన వారోత్సవాల సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం అన్ని శాఖల ఉన్నతాధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ సీపీఆర్ చేసి మాట్లాడారు. అకస్మాత్తుగా కార్డియాక్ అరెస్టు అయినప్పుడు సీపీఆర్ చేసి ప్రమాదం నుంచి కాపాడగలుగుతామన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగార్జున మాట్లాడుతూ కార్డియాక్ అరెస్టు అయితే 108 అంబులెన్స్‌కు సమాచారమిస్తూనే వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేస్తూ ఊపిరి అందిస్తే ప్రాణాలను కాపాడవచ్చన్నారు. గుండె అకస్మాత్తుగా కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు, మెదడు ఇతర ముఖ్యమైన అవయవాలకు రక్తప్రసరణకు అంతరాయం ఏర్పడిన వెంటనే సహాయం అందించకపోతే మెదడు దెబ్బతినడం, నిమిషాల్లో మరణం సంభవిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత, వైద్యులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి



వేములవాడఅర్బన్: మన జీవన విధానంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని జిల్లా కో ఆర్డినేటర్ సురేశ్ కోరారు. అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ నేషనల్ గ్రీన్ కోర్ సహకారంతో బుధవారం క్యాంపస్ ఎకో బజార్, స్వదేశీ దీపావళి నిర్వహించారు. సురేశ్ మాట్లాడుతూ మన జీవితంలో ప్లాస్టిక్ వస్తువు ఒక భాగంగా మారిపోయిందన్నారు. హోటళ్లలో పేపర్ కప్పుల ద్వారా టీ తాగడం ద్వారా ప్లాస్టిక్ కణాలు మన శరీరంలోకి ప్రవేశిస్తున్నాయన్నారు. విద్యార్థులు మట్టితో ప్రమిదలను, బట్టతో సంచులను, మిల్లెట్‌తో ఆహార పదార్థాలు తయారు చేశారు. ప్రిన్సిపాల్ శంకర్, లావణ్య, ప్రేమ్‌కుమార్, కరుణ, శ్రీధర్‌రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తూకంలో తేడా

వీర్నపల్లి(సిరిసిల్ల): రేషన్‌బియ్యం తూకంలో తేడా రావడంతో గ్రామస్తులు డీలర్‌ని నిలదీసిన ఘటన మండలంలోని అడవిపదిరలో చోటుచేసుకుంది. కొందరు లబ్ధిదారులు బుధవారం బియ్యం తీసుకున్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత అనుమానంతో బియ్యాన్ని కిరాణషాపులో మళ్లీ తూకం వేయించారు. తేడా రావడంతో రేషన్‌డీలర్‌ని నిలదీశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మిడ్‌మానేరులో 27 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాజరాజేశ్వర(మిడ్ మానేరు)లో నీటిమట్టం 27.145 టీఎంసీలకు చేరింది. మానేరు, మూలవాగుల్లోంచి 476 క్యూసెక్కులు వస్తోంది.

మందకొడిగా మద్యం దరఖాస్తులు

- వ్యాపార వర్గాల్లో కనిపించని ఉత్సాహం
- నిబంధనలు మారుతాయని అనుమానాలు



దరఖాస్తు అందజేస్తున్న వ్యాపారులు

సిరిసిల్ల క్రైం: జిల్లాలో మద్యం దుకాణాల లైసెన్స్‌ల దరఖాస్తుల విషయంలో ఆసక్తి కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా 48 మద్యం దుకాణాలకు అనుమతి ఉండగా ఇప్పటి వరకు 435 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. దరఖాస్తుల గడువు ఈనెల 18వ తేదీతో ముగియనుండగా ఆసక్తి కనిపించడం లేదని తెలుస్తోంది.

పావులావంతు రాలే..

గతంలో వచ్చిన దరఖాస్తులలో పావులా వంతు కూడా దరఖాస్తులు రాలేదని గణాంకాలు తెలుపుతున్నాయి. పోయిన సారి దరఖాస్తులు 2,036 రాగా.. ఈసారి పావులా వంతు కూడా రాలేదు. వ్యాపార వర్గాల సమాచారం ప్రకారం.. కొత్త లైసెన్స్ నిబంధనల కఠినతరం, భారీ డిపాజిట్‌లు, అనుకోని ఖర్చులు, మార్కెట్‌లో మద్యం విక్రయాలపై ప్రభుత్వ పర్యవేక్షణ కూడా పెరుగుతోందనే ప్రచారంతో వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. అయినా చివరి రోజుల్లో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశముందని ఆబ్కారీ శాఖ అధికారులు చెబుతున్నారు.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి

- కలెక్టర్ ఎం.హరిత
- పత్తి కొనుగోళ్లపై సమీక్ష

సిరిసిల్ల: రైతులు పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ ఎం.హరిత కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం పత్తి కొనుగోళ్లపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 5 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేసిందన్నారు. గత ఏడాది 2,46,000 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారని వెల్లడించారు. జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో ఐదు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారని, వేములవాడ పరిధిలో రెండు, కోనరావుపేట మండలంలో ఒకటి, ఇల్లంతకుంట మండలంలో రెండు ఉన్నాయన్నారు. పత్తి నాణ్యత ఆధారంగా క్వింటాలుకు రూ.7,689 నుంచి రూ.8,110 మద్దతు ధర ఉందని తెలిపారు. 'కపాస్ కిసాన్' యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, మద్దతు ధర పొందేలా అవగాహన కల్పించాలని సూచించారు. పత్తి మద్దతు ధర పోస్టర్లను కలెక్టర్, జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, అదనపు ఎస్పీ చంద్రయ్య, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, రవాణాశాఖ అధికారి లక్ష్మణ్, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్

ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులు హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎం.హరిత, అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, సిరిసిల్ల ఆర్డీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో శేషాద్రి, డీసీఎస్‌వో బి.చంద్రప్రకాశ్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రజిత, డీఏవో అఫ్జల్‌బేగం, డీసీవో రామకృష్ణ, మెప్మా ఏవో మీర్జా అఫ్జల్ ఫసహత్ అలీ భేగ్, రవాణాశాఖ అధికారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వగ్రామానికి యువకుడి మృతదేహం



తేజ (ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని నాగంపేటకు చెందిన బిట్ల తేజ(24) దుబాయిలో అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. నెల రోజుల తర్వాత మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. జీవనోపాధి కోసం 8 నెలల క్రితం తేజ దుబాయి వెళ్లాడు. నెల రోజుల క్రితం ఇంటికొస్తానని షాపింగ్ చేయడానికి బయటకు వెళ్లి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతికి కారణాలు తెలియలేదు.

విద్యుదాఘాతంతో వ్యాపారి మృతి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని కూనారం రోడ్డుకు చెందిన ఢిల్లాల రమేశ్ (55)అనే కిరాణా వ్యాపారి బుధవారం విద్యుత్ షాక్ గురై మరణించాడు. భవనం పైఅంతస్తుకు ఇనుప నిచ్చెన తీసుకెళ్తుండగా.. పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో ఆయన షాక్‌కుగురయ్యాడు. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మేకల కాపరి ఆత్మహత్య



శంకరయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన దాసరి శంకరయ్య(47) అనే మేకల కాపరి అనారోగ్యం బాధ భరించలేక బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలు. శంకరయ్య మేకలను కాస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఐదేళ్ల క్రితం కడుపునొప్పి, షుగర్, బీపీ వ్యాధుల బారిన పడ్డాడు. పలు ఆస్పత్రులు తిరిగి వైద్యం చేయించుకున్నాడు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో వైద్యం కోసం చేసిన అప్పులు మిగిలాయి. భార్య లక్ష్మి మేకలను కాసేందుకు బుధవారం ఉదయం వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్‌రెడ్డి వివరించారు.

గోదావరిలో వ్యక్తి మృతదేహం

మల్హర్: మండలంలోని కొత్తదారాజుపల్లి శివారు గోదావరిలో బుధవారం ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారంతో ఎస్సై రాజు, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారమిచ్చారు. నిర్మల్ జిల్లాకేంద్రం నుంచి జోగినే మానిక కుటుంబ సభ్యులతో వచ్చి శవాన్ని గుర్తుపట్టారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం దేవూర్‌కు చెందిన జోగినే గంగాధర్(35) నిర్మల్ జిల్లాకేంద్రంలో ఫుట్‌వేర్ షాపు నిర్వహిస్తున్నాడు. షాపు సరిగా నడవక అప్పులు పెరిగిపోయాయి. ఈ క్రమంలో ఇంట్లో చెప్పకుండా ఈనెల 8న బైక్‌పై వెళ్లిపోయాడు. 10న సోన్ బ్రిడ్జి వద్ద గోదావరిలో దూకినట్లు తెలుస్తోంది. వరద ఉధృతికి కొట్టుకొచ్చిన శవం కొత్తదారాజుపల్లి వద్ద ఒడ్డుకు చేరింది. మానిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ఓ ప్రాంతానికి చెందిన బాలికపై అత్యాచారానికి యత్నించిన బూసెల్లి నగేష్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై మల్లేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన బాలిక టెన్త్ క్లాస్ చదువుతోంది. ఇటీవల ఇంట్లో ఎవరూ లేని సమయంలో సమీప బంధువైన నగేశ్ ఇంట్లోకి చొరబడి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చైల్డ్‌లైన్ అధికారుల ద్వారా బాలిక పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కుంగుబాటు.. లొంగుబాటు!

- నాడు జనశక్తి.. నేడు మావోయిస్టులు
- 2002లోనే 46 మంది సాయుధ జనశక్తి నక్సలైట్ల సరెండర్
- అప్పటి సీఎంకు ఆయుధాలు అప్పగింత
- నేడు మహారాష్ట్రలో పునరావృతం.. 61 మంది అస్త్రసన్యాసం



సాయుధ నక్సలైట్లు (ఫైల్)



హైదరాబాద్‌లో 2002 ఏప్రిల్ 28న అప్పటి సీఎం చంద్రబాబు ముందు లొంగిపోయిన 46 మంది సాయుధ జనశక్తి నక్సలైట్లు, ఆయుధాలు(ఫైల్)

సిరిసిల్ల: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండున్నర దశాబ్దాల కిందట సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు, జనశక్తి నక్సలైట్ల ఉద్యమాలు బలంగా ఉండేవి. కరీంనగర్ జిల్లాను తూర్పు, పశ్చిమ డివిజన్లుగా విభజించి నక్సలైట్లు కార్యకలాపాలు సాగేవి. అప్పటి పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలు తూర్పు డివిజన్ పరిధిలో ఉండగా.. రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాలు పశ్చిమ డివిజన్ పరిధిలో ఉన్నాయి. తూర్పు డివిజన్‌లో మావోయిస్టు(అప్పటి పీపుల్స్‌వార్)లకు పట్టుండగా.. పశ్చిమ డివిజన్‌లో మావోయిస్టులతోపాటు జనశక్తి నక్సలైట్లు సమాంతర ప్రభుత్వాన్ని నడిపారు. తాజాగా మావోయిస్టు పార్టీకి చెందిన పొలిట్‌బ్యూరో సభ్యుడు, మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ అలియాస్ సోను అలియాస్ భూపతితో సహా 60 మంది సాయుధ నక్సలైట్లు, మహారాష్ట్ర సీఎం దేవేందర్ ఫడ్నవీస్ ఎదుట బుధవారం లొంగిపోయారు. మావోయిస్టు ఉద్యమ చరిత్రలో కేంద్ర కమిటీ సభ్యుడి స్థాయి నాయకుడితోపాటు ఇంత పెద్ద మొత్తంలో మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోవడం ఓ మైలురాయి.

23 ఏళ్ల కిందట జనశక్తి

తాజా పరిణామాల నేపథ్యంలో 23 ఏళ్ల కిందటి సీపీఐ(ఎంఎల్) జనశక్తి సాయుధ నక్సలైట్లు 46 మంది లొంగుబాటు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అప్పటి జనశక్తి పార్టీ కరీంనగర్ జిల్లా కమిటీ కార్యదర్శి రణధీర్ అలియాస్ సంతోష్ సాయిలు ఆధ్వర్యంలో జనశక్తి జిల్లా కమిటీ సభ్యులు ముకేశ్, జగన్, గుట్టన్న, మహేశ్, రవీందర్‌రెడ్డిలతోపాటు మొత్తం 46 మంది సాయుధులు లొంగిపోయారు. ఇప్పుడు గడ్చిరోలి జిల్లా తరహాలోనే అప్పట్లో రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట–రుద్రంగి మధ్య అటవీ ప్రాంతంలో ప్రైవేటు సర్వీసు బస్‌లో 46 మంది సాయుధ నక్సలైట్లు హైదరాబాద్ వెళ్లారు. మధ్యలో ఆ బస్‌లో పోలీసులు ఎక్కారు. రెండు రోజులపాటు హైదరాబాద్ శివారులోని ఓ రిసార్ట్‌లో బసచేసిన నక్సలైట్లు అప్పటి సీఎం చంద్రబాబు సమక్షంలో లొంగిపోయారు. అప్పటి డీజీపీ పేర్వారం రాములు, అప్పటి ఎస్పీ ఐపీఎస్ ప్రవీణ్‌కుమార్(ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకుడు), ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డిలు జనశక్తి నక్సలైట్ల లొంగుబాటులో కీలకపాత్ర పోషించారు. ఆ తర్వాత కొద్ది రోజులకే జనశక్తి పార్టీని వేములవాడ మూలవాగులో నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. ఆ టైంలో మిగిలి ఉన్న కొద్దిమంది యాక్షన్ సభ్యులు కూడా లొంగిపోయారు. తర్వాతి క్రమంలో ఆ పార్టీ కనుమరుగైంది.

లొంగుబాటుకు ముందు..

జనశక్తి నక్సలైట్ల లొంగుబాటుకు ముందు 2001 అక్టోబర్ 26న బోయినపల్లి మండలం కోరెంలో సొంతూరిలో దసరా వేడుకలకు వచ్చిన అప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు బావమరిది క్లాస్–1 కాంట్రాక్టర్ మార్తాండరావును జనశక్తినేత రణధీర్ కిడ్నాప్ చేశారు. రాయబేరం తరువాత వారం రోజులకు విడుదల చేశారు. ఈ క్రమంలో పోలీసు ఉన్నతాధికారులు జనశక్తిపై దృష్టిసారించారు. ఈ క్రమంలో రణధీర్‌తో అప్పటి జిల్లా ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి మరో ఇద్దరు పోలీసు అధికారులు నేరుగా మేడిపల్లి మండలం మెట్టురావుపేట అడవుల్లోకి వెళ్లి రహస్యంగా చర్చలు జరిపి సామూహిక లొంగుబాటుకు బాటలు వేశారు.

మూలవాగులో జనశక్తి నిమజ్జనం

అప్పటికే మూడు దశాబ్దాల ఉద్యమ చరిత్ర గల జనశక్తి సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట, కామారెడ్డి, భీంగల్ ప్రాంతాల్లో బలమైన ప్రజా ఉద్యమాన్ని నడిపించేది. 1989లో సిరిసిల్ల ఎమ్మెల్యేగా నెల్లూరు జిల్లాకు చెందిన ఎన్.వి.కృష్ణయ్యను గెలిపించడంలో జనశక్తి కీలకంగా ఉంది. వేములవాడకు చెందిన కూర రాజన్న అలియాస్ రాజేందర్ నాయకత్వంలో ఉద్యమం బలపడింది. 46 మంది సాయుధ నక్సలైట్ల లొంగుబాటులో ఆ పార్టీ బలహీనపడింది. ఈ నేపథ్యంలో అప్పటి ఎస్పీ ప్రవీణ్‌కుమార్ వేములవాడ మూలవాగులో మాజీ నక్సలైట్లతో జనశక్తి పార్టీని నిమజ్జనం చేశారు. జనశక్తి మిలిటెంట్లపై కేసులు ఎత్తివేస్తున్నామని, ఇకపై సాయుధ కార్యక్రమాలు ఉండవని కొనియాడుతూ... మూలవాగులో పోలీస్ రికార్డుల్లోని కేసులు దహనం చేశారు. అంతకుముందు వేములవాడ ఆర్యవైశ్యభవన్‌లో జనశక్తి పార్టీ శ్రేణులతో ఎస్పీ సమావేశం నిర్వహించి నిమజ్జన లక్ష్యాలను వివరించారు.

పునర్నిర్మాణంలో ఆటుపోట్లు

పోలీసులు చేపట్టిన వేములవాడ నిమజ్జనాన్ని జనశక్తి నాయకత్వం సవాల్‌గా తీసుకుంది. ఉద్యమాన్ని నిర్మించే ప్రయత్నం చేసింది. అప్పటికే 46 మందితో లొంగిపోయిన గుట్టన్న దళనేతగా మరో రెండు దళాలను ఏర్పాటు చేశారు. ఇందులో కిరణ్, సంజీవ్ దళాలు సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతంలో పనిచేస్తూ కొత్తగా పార్టీ కేడర్‌ను రిక్రూట్‌మెంట్ చేసే ప్రయత్నం చేశారు. కోనరావుపేట మండలం వట్టిమల్ల వద్ద ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లను గుట్టన్న దళం కాల్చిచంపగా.. ప్రతిగా మరుసటి రోజే పోలీసులు చందుర్తి మండలం సనుగుల వద్ద ఇద్దరిని ఎన్‌కౌంటర్ చేశారు. గుట్టన్న సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండపం వద్ద ఎన్‌కౌంటర్ అయ్యాడు. 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నక్సలైట్లతో చర్చలు జరపగా.. మావోయిస్టు నాయకులతోపాటు జనశక్తి పక్షాన అప్పటి రాష్ట్ర కార్యదర్శి అమర్ అలియాస్ కూర దేవేందర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు రియాజ్ అలియాస్ వెంకటేశ్ పాల్గొన్నారు. చర్చల అనంతరం 2005 జూన్ 30న ముస్తాబాద్ మండలం బదనకల్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో రియాజ్‌తోపాటు మరో నలుగురు మరణించారు. జనశక్తి అగ్రనేత కూర రాజన్నను ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకి జిల్లాలో, మరో అగ్రనేత అమర్ అలియాస్ దేవేందర్‌ను మహారాష్ట్రలోని పుణేలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో లొంగుబాట్లు, పోలీసు నిర్బంధంతో జనశక్తి సాయుధ దళాలు కనుమరుగయ్యాయి.

తల్లిదండ్రుల మృతి.. అనాథగా బాలుడు



స్వాద్విన్ కుమార్

చొప్పదండి: ఇటీవల గుండెపోటుతో తండ్రి మృతిచెందగా అనాథగా మారిన బాలుడి ఉదంతమిది. మూడేళ్ల క్రితమే ఊపిరితిత్తుల వ్యాధితో తల్లి మృతి చెందగా, దిక్కుతోచని స్థితిలో బంధువుల వద్ద కాలం వెళ్లదీస్తున్నాడు. మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన దీకొండ అశోక్ గత ఆదివారం మృతిచెందాడు. అశోక్ భార్య కూడా మూడేళ్ల క్రితమే మృతి చెందింది. అంతేకాదు అశోక్ తల్లి కూడా ఏడాది క్రితం మూత్రపిండాల వ్యాధితో చనిపోయింది. దీంతో అశోక్ కుమారుడు స్వాద్విన్ కుమార్ అనాథగా మారాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న స్వాద్విన్ ప్రస్తుతం మేనత్తల సంరక్షణలో ఉంటున్నాడు. ఎవరూ లేరని తెలిసి రోదిస్తున్నాడు. ప్రభుత్వం, అధికారులు, దాతలు స్పందించి విద్యార్థిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నృసింహుడి హుండీ ఆదాయం రూ.46.84 లక్షలు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారికి హుండీల ద్వారా లభించిన ఆదాయాన్ని బుధవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. 112 రోజులకు గాను రూ.46,84,046 సమకూరినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. 27 గ్రాముల మిశ్రమ బంగారం, 4,700 కిలోల వెండి, 26 విదేశీనోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. దేవాదాయ శాఖ జిల్లా పరిశీలకులు రాజమౌళి, ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

నా కొద్దు.. హెడ్మాస్టర్ నౌకరీ

- పదోన్నతి రద్దు చేసుకున్న ఉపాధ్యాయుడు

కరీంనగర్‌రూరల్: పదోన్నతి రావాలని ఉద్యోగులందరు కోరుకోవడం సహజం. కానీ, ఈ ఉపాధ్యాయుడు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం అధికారులను ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పదోన్నతిపై గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా వచ్చిన ఈ ఉపాధ్యాయుడు పాఠశాలలో పరిస్థితులను తట్టుకోలేక ప్రమోషన్ రద్దు చేసుకుని పాత పాఠశాలలోనే యధావిధిగా ఉపాధ్యాయుడిగా పోస్టింగ్ పొందడం చర్చనీయాంశంగా మారింది. వివరాలు.. కరీంనగర్‌లోని సవరన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎ.రఘురాంరావు నెల క్రితం పదోన్నతిపై దుర్శేడ్ జెడ్పీ పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా బదిలీపై వచ్చారు. కొన్నిరోజులుగా పాఠశాలలో నెలకొన్న పరిస్థితులు, ఒక స్కూల్ అసిస్టెంట్ వ్యవహరిస్తున్న తీరుతో మానసికంగా ఆందోళనకు గురయ్యారు. విధులు సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. చివరకు కుటుంబ సభ్యుల ఒత్తిడితో పదోన్నతి రద్దు చేయాలని ఈ నెల 13న స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆఫీసుకు దరఖాస్తు చేసుకున్నారు. ఆర్జేడీ ఉత్తర్వుల మేరకు జిల్లా విద్యాధికారి శ్రీరాంమొండయ్య మంగళవారం రఘురాంరావు పదోన్నతిని రద్దు చేసి తిరిగి స్కూల్ అసిస్టెంట్‌గా సవరన్ ప్రభుత్వ పాఠశాలలో చేరాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దుర్శేడ్ స్కూల్‌లో ఒక స్కూల్ అసిస్టెంట్ వ్యవహరిస్తున్న తీరుతోనే రఘురాంరావు వెళ్లిపోయినట్లు ఉపాధ్యాయుల ద్వారా తెలిసింది. గతంలో పాఠశాలలోని పరిస్థితులను తట్టుకోలేక అప్పటి హెచ్ఎం పరబ్రహ్మమూర్తి గుండెపోటుతో మృతిచెందడం ఉపాధ్యాయులను కలవరపరిచింది. ప్రస్తుతం మరో ప్రధానోపాధ్యాయుడు పదోన్నతి రద్దు చేసుకోవడం వివాదాస్పదంగా మారింది. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖాధికారులు దుర్శేడ్ పాఠశాలలో నెలకొన్న అసాధారణ పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

తెరవెనుక డాక్టర్ అనస్థీషియా

- వైద్యరంగంలో వారిసేవలు అద్భుతం
- పేషెంట్‌కు నొప్పి తెలియకుండా సర్జరీలు
- ఉమ్మడి జిల్లాలో ప్రతినెల వేలాది ఆపరేషన్లు
- నేడు ప్రపంచ అనస్థీషియా దినోత్సవం



కోల్‌సిటీ(రామగుండం): పేషెంట్‌కు నొప్పి తెలియకుండా ఆపరేషన్ చేయడం వైద్యశాస్త్రంలో ఓ అద్భుతం. శరీరంలోని ప్రతి అవయవానికి చేసే సర్జరీకి ముందుగా మత్తుమందు(అనస్థీషియా)ఇస్తారు. దీంతో నొప్పి బాధ ఉండదు. క్లిష్టమైన, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడేందుకు అనస్థీషియా నిపుణులు చేస్తున్న సేవలు అత్యంత ముఖ్యమైనవి. తెరవెనుక డాక్టర్ అనస్థీషియా. వీరికోసం ఏటా అక్టోబర్ 16న ప్రపంచ అనస్థీషియా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1846 అక్టోబర్ 16న తొలిసారి విలియం టీజీ మోర్టన్ అనే వైద్యుడు ఈథర్ అనస్థీషియాను విజయవంతంగా ప్రదర్శించారు.

మత్తుమందు లేని రోజుల్లో..

అనస్థీషియా అమలులోకి రాని రోజుల్లో పేషెంట్‌కు శస్త్రచికిత్స చేయాలంటే, మత్తు రావడానికి తలపై గట్టిగా కొట్టడం, పాములతో కరిపించడం, వివిధ రకాల మత్తు పదార్థాలు తినిపించడం, గట్టిగా చేతులతో పట్టుకుని ఆపరేషన్లు చేసేవారని చెబుతున్నారు. అనస్థీషియా అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి శరీరంలో మత్తు ఎక్కించి పేషెంట్‌కు నొప్పి తెలియకుండా ఆపరేషన్ చేస్తున్నారు.

జీజీహెచ్‌లో 13 మంది అనస్థీషియాలు..

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అనస్థీషియాల సహకారంతో ప్రతినెల వేలాది ఆపరేషన్లు జరుగుతున్నాయి. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రభుత్వ సిమ్స్ అనుబంధ జీజీహెచ్‌లో అనస్థీషియా విభాగం ప్రత్యేకంగా ఉంది. ఇందులోని ఇద్దరు ప్రొఫెసర్లు, 10 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఒక ఎస్ఆర్ సేవలు అందిస్తున్నారు.

పేషెంట్ కోలుకునే వరకు..

పేషెంట్‌కు మత్తుమందు ఇచ్చేది అనస్థీషియాలే అయినా.. శస్త్రచికిత్స పూర్తయి, కోలుకునే వరకూ దగ్గరుండి పర్యవేక్షిస్తారు. పేషెంట్ త్వరగా కోలుకున్నాడంటే అందులో అనస్థీషియా పాత్రకీలకంగా ఉంటుంది.

వైద్యరంగంలో కీలకం



వైద్యరంగంలో అనస్థీషియా చాలా కీలకమైనది. ప్రస్తుత వైద్య విధానంలో మత్తుమందు లేకపోతే అసలు ఊహించడం కష్టంగా ఉంటుంది. మత్తుమందు అందుబాటులోకి రావడంతో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి.

– దండె రాజు, ఆర్ఎంవో, జీజీహెచ్

తెరవెనుక వైద్యుడు



తెరవెనుక వైద్యుడు అనస్థీషియా. ఆపరేషన్ చేయడానికి సర్జన్‌తోపాటు అనస్థీషియా కూడా కీలకమే. పేషెంట్ కోలుకునే వరకు పర్యవేక్షిస్తుంటాం. జీజీహెచ్‌లో చాలా హైరిస్క్ కేసులు కూడా అనస్థీషియాల సహకారంతో విజయవంతంగా చేస్తున్నాం.

– అరుణ, గైనిక్ హెచ్‌వోడీ, జీజీహెచ్

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

- మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- సుమారు రూ.40 లక్షల నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోచీబజార్‌లోని వేదిక షాపింగ్‌మాల్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి సుమారు రూ.40 లక్షల మేరకు ఆస్తినష్టం వాటిల్లింది. షాపింగ్‌మాల్ నిర్వాహకులు మంగళవారం రాత్రి తాళం వేసి వెళ్లారు. మాల్ నుంచి పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు సకాలంలో చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే మంటలు వ్యాపించడంతో వస్త్రాలు కాలిపోయాయి. ప్రమాదంలో సుమారు రూ.40 లక్షల విలువైన వస్త్రాలు కాలిపోయినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమని నిర్వాహకులు ఫిర్యాదు చేశారు.

తల్లి, తమ్ముళ్లపై దాడి కేసులో మూడేళ్ల జైలు

ధర్మపురి/జగిత్యాలజోన్: కన్న తల్లి, తమ్ముళ్లపై దాడి చేసిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ధర్మపురి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జానకి బుధవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్ కథనం ప్రకారం.. ధర్మపురి మండలం దొంతాపూర్‌కు చెందిన ఎర్ర కళావతికి ముగ్గురు కుమారులు, ఆమె భర్త మరణించాక పెద్ద కుమారుడు అక్షయ్‌కుమార్ డబ్బుల విషయమై తల్లి, తమ్ముళ్లతో గొడవపడుతుండేవాడు. 20202 అక్టోబర్ 4న తల్లి, తమ్ముళ్లు సంజయ్, ఉదయ్‌కుమార్‌ను దుర్భాషలాడుతూ.. వారిపై దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సైలు శ్రీకాంత్, కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు శ్రీకాంత్, మహేశ్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో పరిశీలించిన జడ్జి అక్షయ్‌కుమార్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

ఇంటర్వెన్షనల్ రేడియాలజీతో సర్జరీలకు స్వస్తి



మాట్లాడుతున్న డాక్టర్ హరీశ్

కరీంనగర్: శస్త్రచికిత్స లేకుండా, నొప్పి తెలియకుండా, వేగవంతమైన రికవరీతో వైద్యం అందించే ఇంటర్వెన్షనల్ రేడియాలజీ అందుబాటులోకి వచ్చాక శస్త్రచికిత్సలకు స్వస్తి పలికినట్లేనని సోమాజిగూడ యశోద హాస్పిటల్ ఇంటర్వెన్షనల్ న్యూరో రేడియాలజిస్ట్ డాక్టర్ హరీశ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని యశోద హెల్త్ సెంటర్‌లో మాట్లాడారు. ఇంటర్వెన్షనల్ రేడియాలజీ శస్త్రచికిత్స రహిత ప్రత్యామ్నాయమన్నారు. బ్రెయిన్ స్ట్రోక్, క్లోటింగ్, బ్లీడింగ్, క్యాన్సర్లు, యుటెరైన్ బ్లీడింగ్ తదితర రోగాల చికిత్సకు ఇది ఎంతో ఉపయోగపడుతోందని వివరించారు. కొన్నిసార్లు డెలివరీ తర్వాత అధిక రక్తస్రావం వల్ల గర్భాశయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, అయితే సాంకేతికత ద్వారా రక్తస్రావం జరుగుతున్న కచ్చితమైన స్థానాన్ని గుర్తించి, ఆ రక్తనాళాన్ని మూసివేయడం సాధ్యమవుతుందన్నారు. బ్లాక్ అయిన నాళాలను తెరవడం, లీకైన నాళాలను మూసివేయడం, మెదడులో రక్తపుగడ్డలను తొలగించడం వంటి సంక్లిష్ట చికిత్సలు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సులభంగా చేస్తోందని తెలిపారు.

'క్రిప్టో' దందాపై పోలీసుల నిఘా

- జిల్లానుంచి పరారైన నిందితులు
- వారి కోసం గాలిస్తున్న పోలీసులు
- పెరుగుతున్న రాజకీయ ఒత్తిళ్లు



మెటాఫండ్‌ప్రో నిర్వాహకులను అరెస్ట్ చూపుతున్న ఎస్పీ (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాలో రెండేళ్లుగా మెటాఫండ్ ప్రో, పలు కంపెనీల పేరుతో ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ వస్తుందని నమ్మించి మోసం చేసిన యాప్ నిర్వాహకులపై పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేయడంతో పాటు, మరికొంత మందిని విచారణ చేపడుతున్నారు. మెటా ఫండ్ పేరుతో మోసం చేసిన వ్యక్తులపై మొదట కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల పట్టణానికి చెందిన మరో వ్యక్తి సుమారు రూ.80.50 లక్షలు మోసం చేశారని ఫిర్యాదు చేయడంతో జగిత్యాలకు చెందిన ఓ వ్యక్తి, హైదరాబాద్‌కు చెందిన మరో వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

విచారణలో వెల్లడవుతున్న పేర్లు

అరెస్ట్ అయిన వారితో పోలీసులు లోతైన విచారణ చేయడంతో సైబర్ సిస్టమ్ దందా చేపట్టిన వారి రహస్యాలు బయటపడుతున్నాయి. అరెస్టయిన వారిలో ఓ వ్యక్తి ఆన్‌లైన్ పెట్టుబడుల్లో ప్రధాన పాత్ర పోషించిన సుమారు 12 మంది పేర్లు వెల్లడించినట్లు సమాచారం. వీరంతా వందలాది మందితో సుమారు రూ.500 నుంచి రూ.800కోట్లు పెట్టుబడి పెట్టించారు. యాప్ మూసినప్పటి నుంచి తమ డబ్బులు చెల్లించాలని పెట్టుబడి పెట్టిన వారు ఒత్తిడి పెంచడంతో వారికి బాండ్ పేపర్లు, చెక్కులు ఇచ్చారు. గడువు ముగిసినా డబ్బులు చెల్లించకపోవడంతో కొంత మంది పోలీసులను ఆశ్రయించడంతో వారిపై కేసు నమోదు చేసి చర్యలు చేపడుతున్నారు.


ఫిర్యాదు చేసేందుకు జంకుతున్న బాధితులు

జిల్లాకు చెందిన కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు తమ పేరిట, బినామీల పేరిట ఆన్‌లైన్ క్రిప్టో దందాలో కోట్లాది రూపాయల పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం వారు మోసపోయామని తెలుసుకున్నా.. ఫిర్యాదు చేసేందుకు మాత్రం జంకుతున్నారు. ఫిర్యాదు చేస్తే డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని విచారణ చేపడతారని భయాందోళన చెందుతున్నారు. మోసపోయిన వారిలో ఒకరిద్దరు పోలీసు అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. వారు కూడా ఫిర్యాదు చేసేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు.

పెరుగుతున్న రాజకీయ ఒత్తిళ్లు

జిల్లాలో వేలాది మంది బాధితులు ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోవడంతో అసలైన యాప్ నిర్వాహకులను గుర్తించి బాధితులను ఆదుకోవాలని రాజకీయ ఒత్తిళ్లు తీవ్రమవుతున్నాయి. ఇప్పటికే మాజీమంత్రి జీవన్‌రెడ్డి ముఖ్యమంత్రికి లేఖ రాశారు. దీనిపై పూర్తివిచారణ చేపట్టాలని రాష్ట్ర పోలీసు అధికారులను విన్నవించారు. అసలు నిందితులను గుర్తించి వారి ఆస్తులను జప్తు చేసి బాధితులకు డబ్బు అందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతాం



ఆన్‌లైన్ పెట్టుబడులు పెట్టి మోసానికి గురైన బాధితులు ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతాం. జగిత్యాలలో ఇద్దరి నుంచి ఫిర్యాదులు అందడంతో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం. ఆన్‌లైన్ పెట్టుబడులపై ఎప్పటికప్పుడు విచారణ చేపడుతున్నాం. మోసం చేసిన వారు ఎవరైనా చర్యలు తప్పవు.

– రఘుచందర్, డీఎస్పీ, జగిత్యాల